ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 244 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

శనివారం 05 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

తమిళ జాలర్లు, బోట్లను విడిచిపెట్టండి :శ్రీలంకను కోరిన ప్రధాని మోదీ

శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే, ప్రధాని మోదీ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా తమిళ జాలర్ల అంశం ప్రస్తావనకొచ్చింది.

(రిపబ్లిక్ న్యూస్), ఏప్రిల్ 5: శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ తమిళ జాలర్ల సమస్యను లేవనెత్తారు. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారు. తమిళ జాలర్లను వెంటనే విడుదల చేయాలని, వారి పడవలను విడిచిపెట్టాలని కోరారు. రెండు దేశాల మధ్య ఏన్నో ఏళ్లుగా ఈ అంశం నలుగుతోంది. దానికి పరిష్కారం చూపే దిశగా తాజా పర్యటనలో చర్చలు జరిగాయి. మత్స్యకారుల సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికే ఉందని ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం పలుమార్లు వెల్లడించింది.

మోదీ శ్రీలంక పర్యటన నేపథ్యంలో ఇటీవల దీనిపై అభ్యర్థనలు చేసిన సంగతి తెలిసిందే. కచ్చతీవు వద్ద రాష్ట్ర జాలర్లు చేపలు పట్టేందుకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని తమిళనాడు సీఎం స్టాలిన్ తెలిపారు. తమ రాష్ట్ర మత్స్యకారులను భారతీయ జాలర్లుగా కేంద్రం చూడాలన్నారు. కచ్చతీవులో చేపలు పట్టడానికి వీలుగా శ్రీలంకతో కొత్త ఒప్పందం అవసరమన్నారు. 2010 తర్వాత శ్రీలంక- భారత్ మధ్య జాలర్ల అంశంపై చర్చలు జరపలేదన్నారు. ఈ క్రమంలోనే తాజాగా మోదీ దీనిపై అభ్యర్థన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రధాని మోదీకి 'శ్రీలంక మిత్ర విభూషణ'..

ప్రధాని మోదీకి శ్రీలంక ప్రభుత్వం అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ద్వీపదేశ అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే 'శ్రీలంక మిత్ర విభూషణ' పురస్కారాన్ని అందజేశారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ప్రధాని ఆ దేశంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. థాయ్లాండ్లో బిమ్స్టెక్ సదస్సు ముగిసిన అనంతరం శుక్రవారం సాయంత్రం ప్రధాని మోదీ నేరుగా అక్కడకు చేరకున్నారు. బండారునాయకే ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టులో దిగిన ఆయనను లంక ప్రభుత్వం ఘనంగా స్వాగతించింది. శనివారం ఉదయం ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద అధ్యక్షుడు సంప్రదాయ పద్ధతుల్లో ఆహ్వానం పలికారు. ఇరుదేశాల మధ్య ఉన్న చరిత్రాత్మక సంబంధాలకు ప్రతీకగా ఈ స్వాగతం నిలిచింది. ఇక రెండు దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు సంతకాలు జరిగాయి. ట్రింకోమలిని ఇంధన కేంద్రంగా అభివృద్ధి చేయడం, శ్రీలంక తూర్పు ప్రాంతానికి భారత్ గ్రాంట్ అందించడం వంటి ఒప్పందాలు జరిగాయి. అలాగే ఇద్దరు నేతలు సాంపూర్ సౌర విద్యుత్ ప్రాజెక్టును వర్చువల్ ప్రారంభించారు. ద్వైపాక్షిక చర్చల అనంతరం మోదీ మాట్లాడుతూ.. "2019లో జరిగిన ఉగ్రదాడి, కొవిడ్ మహమ్మారి, ఇటీవలి ఆర్థిక సంక్షోభం.. ఎలాంటి క్లిష్టసమయంలో అయినా భారత్ శ్రీలంక వెంట ఉంది. రెండు దేశాల భద్రతా ప్రయోజనాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఈ దిశగా జరిగిన రక్షణ సహకారం ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. మత్స్యకారుల సమస్యపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అంగీకారానికి వచ్చాం. శ్రీలంక ప్రభుత్వం తమిళ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశిస్తున్నాం. భారత ప్రయోజనాల విషయంలో అధ్యక్షుడు సానుకూలంగా స్పందిస్తున్నందుకు కృతజ్ఞతలు" అని తెలిపారు. భారత ప్రయోజనాలకు విరుద్ధంగా శ్రీలంక భూభాగాన్ని వినియోగించనివ్వబోమని ఆ దేశాధ్యక్షుడు వెల్లడించారు. క్లిష్ట సమయాల్లో న్యూదిల్లీ అందిస్తోన్న సహకారం ఎంతో విలువైనది. అని పేర్కొన్నారు.

ఏ వ్యక్తీ పేదరికంలో ఉండటానికి వీల్లేదు:చంద్రబాబు

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

ముప్పాళ్ల, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలో చంద్రబాబు పర్యటించారు. అక్కడ నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళి అర్పించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలతో సీఎం మాట్లాడారు. "రాష్ట్రాభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేస్తున్నాం. మహిళల కోసం డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చాం. జన్మభూమి పిలుపునిచ్చినప్పుడు అందరూ స్పందించారు. ఆర్థికంగా పైకి వచ్చినవాళ్లు సమాజానికి ఎంతో కొంత ఇవ్వాలి. అట్టడుగున ఉన్నవారికి చేయూత ఇవ్వాలి. సమాజాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తాను. నేనెప్పుడూ భవిష్యత్తు కోసం రాబోయే 20-30 సంవత్సరాలకు ముందే ఆలోచిస్తా. దేశంలో పుట్టిన ఏ వ్యక్తీ పేదరికంలో ఉండటానికి వీల్లేదు. పేదరిక నిర్మూలన జరగాలి.. తలసరి ఆదాయం పెరగాలి. 2047 నాటికి ప్రపంచంలో భారత్ అగ్రగామిగా ఉంటుంది. పేదల సేవలో భాగంగా ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తున్నాం.

స్వయం ఉపాధి కింద అనేక పథకాలు తీసుకొచ్చాం" "గత ప్రభుత్వం మన నెత్తిన అప్పులు పెట్టి వెళ్లిపోయింది. సంపద సృష్టించాలి.. ఆదాయం పెంచాలి. సంక్షేమ కార్యక్రమాలు చేస్తూనే అభివృద్ధి చేయాలి. పీ-4 కార్యక్రమం ఓ అద్భుతం. ప్రపంచంలో ఎక్కడా ఈ తరహా కార్యక్రమం జరగలేదు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. వీటిని తగ్గించాలి. పేదరికం మీరు తెచ్చుకున్నది కాదు. కానీ, దానిని అధిగమించాలి. అవకాశాలను అందిపుచ్చుకోవడం ముఖ్యం. 8 సార్లు ఎమ్మెల్యేగా, 15 సంవత్సరాలు సీఎంగా ఉన్నాను. నా రికార్డులు బద్దలు కొట్టడం సాధ్యం కాదు. డబ్బు వల్ల సమాజంలో గుర్తింపు రాదు. మంచిపని చేస్తేనే అది సాధ్యమవుతుంది. ఎస్సీల్లో వర్గీకరణ జరగాలని 30 ఏళ్ల క్రితం నిర్ణయించాం. పేదలు ఎక్కడ ఉంటే నేను అక్కడ ఉంటా. బాబు జగ్జీవన్రామ్ ఆశయాలను సాధిస్తాం. 'బాబు జగ్జీవన్‌రామ్' పథకం కింద ఎస్సీలకు 2 కిలోవాట్స్ సోలార్ విద్యుత్ అందిస్తాం. నూటికి నూరుశాతం ఎస్సీ, బీసీల పిల్లలకు గురుకుల విద్య అందిస్తాం. ఎస్సీల్లో నైపుణ్య శిక్షణ పెంపొందిస్తాం. అన్ని గ్రామాల్లో రోడ్లు బాగు చేశాం. ఇది మంచి మార్పు. వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ కోసం రూ.15 కోట్లు ఇస్తాం. రైతు సంఘాల ద్వారా పంటలు పండించే బాధ్యత తీసుకుంటాం. ఏటూరు-మొగులూరు కాజ్వే నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తాం. సుబాబుల్ రైతులకు న్యాయం చేస్తాం. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన వారందర్నీ గౌరవించి ముందుకు తీసుకొస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ను లాభాల బాట పట్టిస్తున్నాం. రైల్వే జోన్ను సాధించాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా పాలన సాగిస్తున్నాం. పీ-4 ద్వారా మరిన్ని కార్యక్రమాలు సాధిస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

బోయిన్‌పల్లిలో ఆరుగురు కుటుంబసభ్యుల అదృశ్యం కేసులో పురోగతి

బోయిన్‌పల్లిలో ఆరుగురు కుటుంబసభ్యులు అదృశ్యమైన ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

హైదరాబాద్, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): బోయిన్‌పల్లిలో ఆరుగురు కుటుంబసభ్యులు అదృశ్యమైన ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. వారంతా ఎంజీబీఎస్ నుంచి విజయవాడ వెళ్లినట్లు సీసీ ఫుటేజ్లో పోలీసులు గుర్తించారు. తమ మధ్య ఎలాంటి తగాదాలు లేవని కుటుంబసభ్యుడు నరేశ్ తెలిపాడు. అయితే, అందరి ఫోన్లు స్విచ్ఆఫ్ వస్తుండటంతో ఆందోళనగా ఉందన్నాడు.

వారంతా తీర్థయాత్రకు వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపాడు. న్యూ బోయినపల్లి ఏడుగుళ్ల సమీపంలో నివాసం ఉండే మహేశ్, ఉమా దంపతులు, వారి ముగ్గురు పిల్లలతోపాటు సంధ్య అనే మరో కుటుంబ సభ్యురాలు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మహేశ్ స్థానిక నీటి సరఫరా కేంద్రంలో ఆపరేటర్ పని చేస్తున్నాడు. వీరి ఇంటికి సంధ్య గురువారం ఉదయం వెళ్లింది. మహేశ్, ఉమా.. వారి పిల్లలు రిషి, చైతు, శివన్లతో పాటు సంధ్య ఒకేసారి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఉమా సోదరుడు భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ ఆరుగురు ఆటో బుక్ చేసుకొని బోయినపల్లి నుంచి ఎంజీబీఎస్ స్టేషన్కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడినుంచి విజయవాడ వెళ్లినట్లు గుర్తించి.. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

తితిదే ఛైర్మన్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

తితిదే చైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ రాశారు.

హైదరాబాద్, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): తితిదే చైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. కరీంనగర్ తితిదే ఆలయ నిర్మాణానికి సహకరించాలని అందులో విజ్ఞప్తి చేశారు. 2023లోనే కరీంనగర్లో తితిదే ఆలయానికి అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. "2023 మే 31న కరీంనగర్లో లో 10 ఎకరాల స్థలంలో భూమి పూజ జరిగింది. రెండేళ్ల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తితిదే ఆలయ నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆలయ పనులు యుద్ధ ప్రాతిపదికన జరిపించండి" అని బండి సంజయ్ కోరారు.

రామానాయుడు స్టూడియోకు కలెక్టర్ నోటీసులు

విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోకు నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండు వారాల సమయం ఇస్తామని, వారి వివరణ తర్వాత చర్యలు ఉంటాయని అన్నారు.

విశాఖ, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోకు నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండు వారాల సమయం ఇస్తామని, వారి వివరణ తర్వాత చర్యలు ఉంటాయని అన్నారు. "రామానాయుడు స్టూడియోకు చిత్ర నిర్మాణ పరిశ్రమ, స్టూడియో నిర్మాణం కోసం ప్రభుత్వం 34 ఎకరాలకు పైగా భూమిని కేటాయించింది. అందులో 15.17 ఎకరాలు హౌసింగ్ లేఅవుట్ కోసం మార్పు చేయాలని స్టూడియో యాజమాన్యం కోరింది. అది నిబంధనలకు విరుద్ధమని.. నోటీసులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని కలెక్టర్ వివరించారు. రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూముల వ్యవహారంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. నివాస స్థలాలుగా మార్పు చేయాలని తలపెట్టిన 15.17 ఎకరాల భూ కేటాయింపు రద్దు చేయాలని నిర్ణయించింది. నిర్దేశించిన ప్రయోజనం కోసం ఇచ్చిన భూమిని అప్రయోజనం కోసం వినియోగిస్తే రద్దు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం... రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు. సిసోదియా ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ తాజాగా నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

ఎన్టీఆర్ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన.. స్వాగతం పలికిన మంత్రులు

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారు.

ముప్పాళ్ల, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడ నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళి అర్పించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలతో సీఎం చర్చించనున్నారు. అనంతరం పార్టీ నేతలతో భేటీ కానున్నారు. అంతకు ముందు ముప్పాళ్లలో సీఎంకు హెూంమంత్రి అనిత, మంత్రులు కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎంపీ కేశినేని శివనాథ్ ఘన స్వాగతం పలికారు.

యువతులతో డ్రగ్స్ డెలివరీ.. ముఠా వివరాలు వెల్లడించిన సందీప్ శాండిల్య

విదేశాలకు అక్రమంగా డబ్బును బదిలీ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును ఈ ముఠా విదేశాలకు తరలిస్తోంది.

హైదరాబాద్, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): విదేశాలకు అక్రమంగా డబ్బును బదిలీ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును ఈ ముఠా విదేశాలకు తరలిస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు నైజీరియన్లను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు. గత 3 నెలలకు పైగా ఈ ముఠాపై నిఘా పెట్టినట్లు చెప్పారు.

డ్రగ్స్ తీసుకున్నాక నగదు చెల్లింపులు జరుపుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వీటిని డెలివరీ చేసేందుకు అమ్మాయిలను ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో తెలిసిందని పేర్కొన్నారు. టోలీచౌకి ప్రాంతంలో డ్రగ్స్ డెలివరీ చేసిన యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేసినట్లు వివరించారు. ముఠా సభ్యులు ఆ యువతికి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు. "గత 5 సంవత్సరాలుగా డ్రగ్స్ ద్వారా నైజీరియాకు వెళ్లిన డబ్బుల వివరాలు సేకరించాం. భారత్తో పాటు అమెరికాలో నైజీరియన్లు డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. డ్రగ్స్ కావాలని కస్టమర్లు డబ్బులు చెల్లించే లావాదేవీల ద్వారా నిందితులను పట్టుకున్నాం. కస్టమర్లు డబ్బులు చెల్లించేందుకు 15 మంది యువతుల బ్యాంక్ ఖాతాలు ఇచ్చారు. 5 సంవత్సరాల్లో డ్రగ్స్ కోసం భారత్-అమెరికా-నైజీరియన్ల మధ్య కోట్ల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు తేల్చాం. అమెరికా నుంచి డబ్బులు నేరుగా నైజీరియాకు వెళ్లకుండా.. మొదట భారత్కు పంపిస్తారు. ఇక్కడి నుంచి హవాలా మార్గంలో నైజీరియాకు తీసుకెళ్తారు. డ్రగ్స్ మొత్తం విదేశాల్లోనే తయారు అవుతున్నాయి. మన దేశంలో చాలా తక్కువ తయారవుతున్నట్లు గుర్తించాం. ఫారెక్స్ ఏజెంట్ల సహకారంతో నైజీరియన్లు డబ్బులను విదేశాలకు తరలిస్తున్నారు." అని సందీప్ శాండిల్య చెప్పారు.

లొంగిపోయిన 86 మంది మావోయిస్టులు

పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.

కొత్తగూడెం, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. భద్రాద్రి కొత్తగూడెం పోలీసుల ఎదుట 86 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పోలీసు బెటాలియన్ కార్యాలయంలో కొత్తగూడెం మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో వీరంతా లొంగిపోయారు. అనంతరం చంద్రశేఖర్రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోయిస్టులంతా ఛత్తీస్ గఢ్ రాష్ట్రానికి చెందినవారని తెలిపారు. వీరిలో 66 మంది పురుషులు, 20 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమంలో భాగంగా వీరంతా లొంగిపోయినట్లు ఐజీ పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి తక్షణ సాయం కింద రూ. 25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

భూగర్భ డోలమైట్ గనిలో పేలుడు

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొండుపల్లిలో పేలుడు సంభవించింది.

పెద్దవడుగూరు, ఏప్రిల్ 5, (రిపబ్లిక్ న్యూస్): అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొండుపల్లిలో పేలుడు సంభవించింది. భూగర్భ డోలమైట్ గనిలో పేలుడు చోటుచేసుకుని నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. యాడికిలోని ప్రైవేట్ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. భూగర్భగనిలో పేల్చడానికి నిప్పు పెడుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1908: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు జగ్జీవన్ రామ్ జననం. (మ.1986). (చిత్రంలో)
- 1918: వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖ ఉద్యమకారుడు, రాజకీయవేత్త ఇటికాల మధుసూదనరావు జననం.
- 1922: భారతీయ సంఘ సంస్కర్త పండిత రమాబాయి మరణం (జ.1858).
- 1937: భారత మాజీ పార్లమెంటు సభ్యుడు, తెలుగు సినిమా నిర్మాత చేగొండి వెంకట హరిరామజోగయ్య జననం.
- 1993: భారతీయ సినిమానటి దివ్యభారతి మరణం (జ.1974).
- 1994: అమెరికాకు చెందిన పాటల రచయిత, స్వరకర్త కర్ట్ కోబెన్ మరణం (జ.1967).

అమెరికా జాతీయ జండా

కాంగ్రా భూకంపం

సర్ విలియం క్రూక్స్

మార్టిన్ లూథర్ కింగ్

మైక్రోసాఫ్ట్ సంస్థ

అబ్బూరి రామకృష్ణారావు

మహేశ్ చేతిలో పాస్‌పోర్ట్.. నెట్టింట మొదలైన ఫన్నీ మీమ్స్

మూడు నెలల క్రితం రాజమౌళి చేతిలో మహేశ్ పాస్పోర్ట్ ఉన్న ఫొటో వైరలైంది.

ఇప్పుడు మహేశ్ తన పాస్‌పోర్ట్‌ను చూపించిన వీడియో వైరల్‌గా మారింది.



మన వస్తువు మన చేతికి వస్తే ఆ ఆనందమే వేరు కదా.. ఇలాంటి ఆనందంలోనే ఉన్నారు మన సూపర్ స్టార్ మహేశ్ బాబు. తన పాస్పోర్ట్ తనకు వచ్చేసిందంటూ ఎయిర్‌పోర్ట్‌లో ఫొటోగ్రాఫర్లకు సరదాగా చూపించారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది. ఇండస్ట్రీలో ఎక్కువగా విహారయాత్రలకు వెళ్లే హీరో ఎవరంటే వెంటనే గుర్తొచ్చే పేరు మహేశ్ బాబు. ఇప్పుడీ హీరో రాజమౌళి సినిమాతో #SSMB29 బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ దర్శకధీరుడు మూడు నెలల క్రితం మహేశ్ పాస్పోర్ట్ తీసుకున్నానంటూ ఓ పోస్ట్ పెట్టారు. ఆ రోజు సోషల్ మీడియా అంతా ఫన్నీ మీల్తో నిండిపోయింది. ఇప్పుడు మహేశ్ తన పాస్పోర్ట్ను చూపుతూ ఓ వీడియోలో కనిపించారు. దీంతో మరోసారి మీమర్స్ పని పడింది. 'మై పాస్పోర్ట్ ఈజ్ బ్యాక్', 'పాస్పోర్ట్ వచ్చేసింది.. నన్ను ఎవరూ ఆపలేరు' అంటూ నెట్టింట మహేశ్ వెర్షన్ మీమ్స్ సందడి చేస్తున్నాయి. #SSMB29 హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్లోకి వచ్చింది. ఇక ఈ సినిమా అప్డేట్ విషయానికొస్తే.. ఇటీవలే ఒడిశాలో ఓ షెడ్యూల్ పూర్తయింది #SSMB29. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్సేల్, బాల్డ ప్రాంతాల్లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మహేశ్తో పాటు పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా తదితరులు ఈ షూటింగ్లో పాల్గొన్నారు. ఇందులో ప్రియాంకతో కొన్ని యాక్షన్ సన్నివేశాలు పూర్తి చేసినట్లు వార్తలు వచ్చాయి.

నా ఆస్తులు తాకట్టు పెట్టిమరీ ఆ సినిమా తీశాను: మోహన్ బాబు

తన కెరీర్ గురించి మోహన్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను నటుడిగా ఎప్పుడూ ఫెయిల్ కాలేదన్నారు.

ట్రోలింగ్లను తాను పట్టించుకోనని అన్నారు నటుడు మోహన్ బాబు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన బాల్యం, కెరీర్ గురించి పంచుకున్నారు. జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. ట్రోల్స్ చేసేవారిని ఉద్దేశించి మాట్లాడారు. 'కన్నప్ప' సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "నేను చూసిన తొలి సినిమా 'రాజమకుటం'. ఎవరికీ చెప్పకుండా 4 కి.మీ. నడుచుకుంటూ వెళ్లి ఆ సినిమా చూశా. దాసరి నారాయణరావు నాకు సినిమాల్లో మొదటి అవకాశం ఇచ్చారు. 1975లో స్వర్గం-నరకం సినిమాతో విలన్గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యాను. అప్పటినుంచి ఇప్పటివరకూ కొనసాగుతున్నాను. 'ప్రతిజ్ఞ' సినిమాతో నిర్మాతగా మారాను. నా బ్యానర్లు ప్రారంభించింది సీనియర్ ఎన్టీఆరే. చంద్రబాబునాయుడు ఆ ప్రారంభోత్సవానికి క్లాప్ కొట్టారు. అదే బ్యానర్పై సీనియర్ ఎన్టీఆర్ హీరోగా నా ఆస్తులు అన్నీ తాకట్టు పెట్టిమరీ 'మేజర్ చంద్రకాంత్' తీశాను. అన్నగారు (ఎన్టీఆర్) వద్దు అని వారించారు. మొండిగా ఆ సినిమా తీశాను. సక్సెస్ అయ్యాను" "రాజకీయాలు నాకు సెట్ అవ్వవు. నేను కోరుకున్నవి అన్నీ జరిగాయి. దేవుడి ఆశీస్సులతో మంచి పాత్రలు వస్తే నటిస్తూ.. పిల్లలతో సరదాగా ఉండాలనుకుంటున్నాను. సినిమా ఫెయిల్యూర్ వేరు.. నటుడిగా ఫెయిల్ కావడం వేరు. నేను నటుడిగా ఎప్పుడూ ఓడిపోలేదు. దాదాపు 560 సినిమాలు చేశాను. ఇప్పుడు నా పిల్లలు నటిస్తున్నారు. నేను అరుదుగా చేస్తున్నాను. ఒక్కొక్కరికీ కోపం ఒక్కోవిధంగా ఉంటుంది. నాకు ఆవేశం ఎక్కువే గతాన్ని తవ్వుకోవడం వల్ల ఉపయోగం ఉండదు. నేను ఎప్పుడూ ఇతరులకు అపకారం చేయలేదు. నన్ను ఎంతోమంది మోసం చేశారు. అప్పటినుంచే ఆవేశం వచ్చింది. నా ఆవేశం నాకు నష్టాన్ని కలిగించింది" "నేను ట్రోలింగ్లను పట్టించుకోను. పక్కవారు నాశనం అవ్వాలని ఎప్పుడూ కోరుకోకూడదు. అలా కోరుకుంటే వాళ్లకంటే ముందు మనం నాశనం అవుతాం. ఒకరిని మార్చాలని ఎప్పుడూ భావించకూడదు. అందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటాను. ట్రోలింగ్ చేయడం వల్ల వాళ్లకు ఏం ఆనందం వస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కాదు. నేను ఈ విషయంలో ఎవరినీ నిందించను. దేవుడి దయ వల్లే 'కన్నప్ప' సినిమాలో అవకాశం వచ్చింది. ఈ సినిమా ఆయన ఆశీస్సులతోనే పూర్తయింది. నా దృష్టిలో ప్రజలే ప్రత్యక్ష దేవుళ్లు" అని మోహన్ బాబు చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఎన్టీఆర్ పై బాలీవుడ్ హీరో ఆసక్తికర వ్యాఖ్యలు

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2', తాజాగా ఈ హీరో ఎన్టీఆర్పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్పై బాలీవుడ్ అగ్ర కథానాయకుడు హృతిక్ రోషన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరూ కలిసి 'వార్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఈవెంట్ లో పాల్గొన్న ఆయన ఈ సినిమా ఆగస్టు 14న విడుదల అవుతుందని మరోసారి స్పష్టం చేశారు. తారక్ గురించి హృతిక్ మాట్లాడుతూ.. "ఒక పాట మినహా 'వార్' షూటింగ్ అంతా పూర్తయ్యింది. నాకు ఇష్టమైన సహనటుడు ఎన్టీఆర్. గొప్ప నటుడు. మంచి టీమ్మేట్. మా సినిమా అద్భుతంగా వచ్చింది. ఆగస్టు 14న థియేటర్లలోకి రానుంది. దీనికోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని చెప్పారు. దీంతో ఆ వేదికంతా కేరింతలతో మారుమోగింది. ఈ హీరో మాటలతో సినిమా విడుదలపై కూడా మరోసారి స్పష్టత వచ్చింది. హృతిక్ రోషన్, టైగర్ ప్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్ సక్సెస్ సాధించి బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. దీనికి సీక్వెల్గా తెరకెక్కుతున్న చిత్రమే 'వార్2'. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్గా నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. గతంలో సల్మానాఖాన్, హృతిక్ రోషన్, షారుకఖాన్లు ఏజెంట్ పాత్రలో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉండనుంది. భారీ యాక్షన్ చిత్రంగా యశ్ రాజ్ ఫిల్మ్స్ సంస్థపై అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఇది రానుంది.

రిపబ్లిక్ స్పోర్ట్స్

అమ్మా.. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఉన్నా:రిపోర్టర్ ఫోన్ ఎత్తిన లాంగర్

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ చేసిన పని నవ్వులు తెప్పించింది.

ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సొంత మైదానంలో లఖ్నవ్వూ సూపర్ జెయింట్స్ అద్భుత విజయం సాధించింది. ముంబయి ఇండియన్స్ను 12 పరుగుల తేడాతో మట్టికరిపించింది. మ్యాచ్ అనంతరం లఖ్ నవూ కోచ్ జస్టిన్ లాంగర్ ప్రెస్ కాన్ఫరెన్స్నో మాట్లాడాడు. ఈసందర్భంగా మైక్ లు ఉంచిన టేబుల్ పైనే ఓ రిపోర్టర్ ఫోన్ ఉంది. అప్పుడే కాల్ వచ్చింది. ఆ జర్నలిస్ట్ పర్మిషన్ తీసుకున్న లాంగర్ ఆ ఫోన్ కాల్కు సమాధానం ఇస్తూ.. "అమ్మా.. ఇప్పుడు 12.08 గంటలైంది (శుక్రవారం అర్ధరాత్రి). నేను ప్రెస్ కాన్ఫరెన్స్నో ఉన్నా" అని చెప్పడంతో అంతా నవ్వేశారు.

మయాంక్ విషయంలో..

" జాతీయ క్రికెట్ అకాడమీలో మయాంక్ యాదవ్ కోలుకుంటున్నాడు. అతడి బౌలింగ్ వీడియోలను చూశా. 90 నుంచి 95 శాతం ఎఫిషియన్సీతో బౌలింగ్ చేశాడు. అతడి రన్నప్ బాగుంది. మయాంక్ మళ్లీ మైదానంలోకి దిగితే ఐపీఎల్కే కాకుండా.. భారత క్రికెట్ జట్టుకు ప్రయోజనం. మయాంక్ కంటే వేగంగా బంతులేసే బౌలర్ టీమ్ ఇండియాలో లేరని భావిస్తున్నా. అందుకే, అతడి గురించి ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుతున్నారు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పనితీరు చాలా బాగుంది. మా జట్టులో అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్ వంటి బౌలర్లు ఉన్నారు. తప్పకుండా మయాంక్ కూడా జట్టుతోపాటు త్వరలోనే చేరతాడని భావిస్తున్నా" అని వెల్లడించాడు.

రాఠి మా కీలక బౌలర్: రిషభ్ పంత్

యువ బౌలర్ దిగ్వేశ్ రాఠి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నిలిచాడు. అతడిపై కెప్టెన్ రిషబ్ పంత్ ప్రశంసల వర్షం కురిపించాడు. "పిచ్ చాలా బాగుంది. ఇంతకుముందు విభిన్నమైన పిచ్పై ఆడాం. అయితే, ఎలాంటి వికెట్పైనైనా ఆడేందుకు ఎప్పుడూ సిద్ధమే. మిచెల్ మార్ష్ అద్భుతమైన ఆరంభం ఇచ్చాడు. ఆ తర్వాత మిడిలార్డర్ ఆడుతోంది. పరిస్థితికి అనుగుణంగా ఆడాం. దిగ్వేశ్ రాఠి మాకు కీలక బౌలర్. యువ క్రికెటర్ ఇలాంటి ప్రదర్శన చేయడం నిజంగా అద్భుతం" అని పంత్ వెల్లడించాడు.

ఆరోగ్యం

బయట దొరికే కాటుకని కొని వాడుతున్నారా, కళ్లకి సమస్యలు

రావొచ్చు, ఇంట్లోనే తయారుచేసి హ్యాపీగా వాడుకోండి

కళ్లకి కాటుక పెట్టుకుంటే ఆ అందమే వేరు. కలువ కళ్లకి కాటుక మరింత అందాన్ని తీసుకొస్తుంది. అందుకోసమే అతివలు కళ్లకి పెట్టుకునే కాజల్కి చాలానే ఖర్చుపెడతారు. అయితే, దీనిని బయట కొన్నది కాకుండా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. ఎలానో తెలుసుకోండి.



కాటుక కళ్లు ఎంతో అందంగా కనిపిస్తాయి. కలువరేకుల్లాంటి కళ్లకి కాటుక ఎక్స్ట్రా బ్యూటీని యాడ్ చేస్తుంది. అందుకే, ఎన్ని మేకప్ ప్రొడక్ట్స్ వచ్చినా కాజల్కి ఉండే క్రేజే వేరు. ఎన్ని ప్రొడక్ట్స్ వచ్చినా వీటిని కొనేందుకు ఎక్కువ మంది ఇష్టపడతారు. వందలు, వేలైనా పెట్టి మరీ కొంటారు. అయితే, అవన్నీ కూడా ఎంతో కొంత కెమికల్స్తో తయారైనవే ఉంటాయి. అలా కాకుండా మనకి మనంగానే ఇంట్లోనే కాజల్ని తయారుచేసుకోవచ్చు. దీంతో చూడ్డానికి ఎంతో అందంగా కనిపించొచ్చు. పైగా కళ్లపై ఎలాంటి ఎఫెక్ట్ పడదు. అదెలానో తెలుసుకోండి.

కావాల్సిన పదార్థాలు

నువ్వుల నూనె లేదా నెయ్యి : 2 టేబుల్ స్పూన్స్
బాదం లేదా బాదం ఆయిల్ : 1 టీ స్పూన్
ఆముదం : 1 టీస్పూన్
చిన్న బౌల్
క్యాండిల్

ఎలా తయారు చేయాలి



కాజల్ తయారుచేసేందుకు మీరు బాదం వాడుతుంటే వాటిని ముందుగా ఓ రాత్రంతా నీటిలో నానబెట్టి సాఫ్ట్‌గా కానివ్వండి. తర్వాతి రోజు పీల్ చేయండి. తర్వాత వీటిని మెత్తగా చేయండి. పేస్టులా చేయండి. అదే మీరు బాదం నూనె వాడితే సమస్యలేదు.

పదార్థాలను కలపడం

ఓ బౌల్‌లో బాదం పేస్ట్ లేదా బాదం నూనెని వేయండి. అందులోనే కొద్దిగా నువ్వుల నూనే లేదా నెయ్యి వేయండి. వీటన్నింటిని బాగా కలపండి. స్మూత్ టెక్చర్ వచ్చేవరకూ కలపండి. తర్వాత ఇందులోనే ఆముదం కలపాలి.

వేడి చేయడం

ఇప్పుడు బౌల్‌ని క్యాండిల్ లేదా దీపంపై పెట్టి వేడిచేయండి. వేడి అవుతున్నప్పుడు కలుపుతూనే ఉండండి. లేదంటే మొత్తం మాడిపోయే అవకాశం ఉంది. మిక్చర్ మొత్తం థిక్ అండ్ బ్లాక్ అయ్యేవరకూ ఇలానే చేయండి. దీనికోసం 10 నుంచి 15 నిమిషాల టైమ్ పడుతుంది.

కలర్ వచ్చాక



ఈ మిక్స్ మొత్తం అనుకున్న రంగు, టెక్చర్‌లోకి రాగానే మంట నుంచి తీసేసి కాటన్ క్లాత్ లేదా వత్తి తీసుకోండి. దీనిని కాజల్ మిశ్రమంలో ముంచండి. ఇప్పుడు ఉన్న కాస్తా తడి మొత్తం అబ్జార్బ్ చేసుకుంటుంది. దీనిని మీ బొటన వేలు, చూపుడు వేలు మధ్యలో ఉంచి ఎక్స్ట్రాగా ఉన్న లిక్విడ్‌ని తీసేయండి.

స్టోర్ చేయడం



ఇప్పుడు ఓ అగ్గిపుల్ల, క్యాండిల్‌ని వెలిగించి నానబెట్టిన క్లాత్, వత్తుని మంట దగ్గరగా పట్టుకోండి. ఇది కాలుతూ పొగ వస్తుంది. మంట ఆర్పేసి పూర్తిగా కాల్చేయండి. దీంతో మొత్తం అది నల్లగా మారుతుంది. దీనినే మీరు కాజల్‌లా వాడుకోవచ్చు. దీనిని ఓ కంటెయినర్‌లో స్టోర్ చేయండి. వాడేటప్పుడు అవసరం అనుకుంటే కొద్దిగా ఆలివ్ ఆయిల్, ఆముదం, బాదం కలిపి పేస్ట్‌లా చేసి దీనిని కాజల్‌లా వాడుకోండి. దీనిని అప్లై చేయడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. పైగా కళ్లకి చాలా మంచిది.

గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.